

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.142	206	234
సూర్యాపేట	రూ.130	200	230
నల్లగొండ	రూ.136	200	230

ఉష్ణోగ్రత గరిష్ఠం 39.0 | కనిష్ఠం 24.0



యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి దివ్యక్షేత్రం

కొత్త ప్రభుత్వంపైనే ఆశలు

రాజసం ఉట్టిపడే సప్త గోపురాలు.. కాకతీయుల సంప్రదాయ కృష్ణశిలా సౌరభాలు.. ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసేలా ప్రధానాలయ ముఖమండపం.. నలుదిక్కులా విశాలమైన మాఢవీధులు.. ఇలా ఒక్కో కట్టడం ఒక్కో ప్రత్యేకతను సంతరించుకునేలా అద్భుతమైన ఆలయంగా తీర్చిదిద్దిన యాదగిరీశుడి దివ్యక్షేత్రం ఉద్ఘాటన జరిగి నేటికి రెండేళ్లు పూర్తయ్యింది. సుమారు ఐదేళ్లపాటు కొనసాగిన ఈ ఆలయ పునర్నిర్మాణ పనులకు ప్రభుత్వం రూ.1280 కోట్లు వెచ్చించింది. దేశవ్యాప్తంగా ఉన్న మఠాధిపతులు, పీఠాధిపతులు, వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల నడుమ ఉద్ఘాటన కార్యక్రమం 2022, మార్చి 28వ తేదీన అంగరంగ వైభవంగా సాగింది. అయితే యాదగిరికొండపై పలు పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఉద్ఘాటనకు ముందు కొనసాగిన ఆచారాల అమలు కోసం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

- యాదగిరీశుడి ఆలయ ఉద్ఘాటనకు రెండేళ్లు
- రోజురోజుకూ పెరుగుతోన్న భక్తుల సంఖ్య
- ఇంకా కొనసాగుతూనే ఉన్న పలు నిర్మాణ పనులు
- కొత్త ప్రభుత్వం రాకతో సౌకర్యాల కల్పనపై ఆశలు
- పాత ఆచారాలను అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- ఇప్పటికే కొండపైకి ఆటోలకు అనుమతి

యాదగిరీశుడి సన్నిధిలో మెరుగైన వసతుల కల్పన కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా లక్ష్మీనృసింహుడి కొండపై భక్తుల పాత ఆచారాలను పునరుద్ధరించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. గతంలో స్వామివారి సన్నిధిలో.. కొండపై నిద్రచేసి మొక్కును చెల్లించుకోవడం ఆనవాయితీగా ఉండేది. అయితే ఉద్ఘాటన పనులు ఆరంభమైన నాటి నుంచి మొక్కు నిద్రకు భక్తులకు అవకాశం లేదు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొక్కు నిద్రకు అనుమతి ఇవ్వడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా కొండపైన కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి, పక్కనే ఉన్న పుష్కరిణి(గుండం)లో స్నానాలు చేసేవారు. గర్భాలయ ప్రదక్షిణ, కొబ్బరికాయల సమర్పణ వంటి సౌకర్యాలు ఉండేవి. అయితే గత ప్రభుత్వం 2016లో యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ప్రధానాలయాన్ని పునరుద్ధరించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా కొండపై అప్పటివరకు ఉన్న సౌకర్యాలన్నీ కూడా కొండ కింద కల్పించేందుకు చర్యలు తీసుకుంది. ఈమేరకు బాలాలయం ఏర్పాటుచేసి ఆగమ, వైదికశాస్త్ర నియమాలతో ఉత్సవమూర్తులను ప్రతిష్ఠించారు. 2022 మార్చి 28 ఆలయ ఉద్ఘాటన జరిగింది. భక్తులకోసం కొండపైన ఉన్న పాత ఆచారాలన్నింటినీ పక్కనబెట్టి, వీటి కోసం ఎలాంటి స్థలాన్ని కూడా కేటాయించలేదు. భక్తులు కొండకింద ఉన్న సత్రాల్లో స్నానాలు చేసుకుని స్వామివారిని దర్శించుకుంటున్నారు. కొండపైన ఉన్న పుష్కరిణిలోకి భక్తులను అనుమతించలేదు. కొండ కింద లక్ష్మీ పుష్కరిణి పేరుతో నూతనంగా గుండాన్ని నిర్మించారు. సత్యనారాయణ స్వామి వ్రతం, కల్యాణకట్ట, అన్నదానం, తదితర సేవలన్నీ కూడా కొండకిందే ఏర్పాటుచేశారు. కొండపైన గుండానికి విష్ణుపుష్కరిణిగా నామకరణం చేశారు. ఈ పుష్కరిణిని స్వామివారి చక్రతీర్థంకోసం వినియోగిస్తున్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య కొండపైన భక్తులకు పాత ఆచారాలను పునరుద్ధరిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు ప్రభుత్వంతో, అధికారులతో చర్చించి, ఇటీవల స్వామివారి సన్నిధిలో కొబ్బరికాయలు కొట్టే స్థలాన్ని ప్రారంభించారు. అదేవిధంగా కొండపైకి ఆటోలను అనుమతించారు. రాత్రివేళ భక్తులు నిద్ర చేసేందుకు భక్తులకోసం క్యూకాంప్లెక్స్‌లో గతంలో శివాలయం (తాత్కాలికంగా) ఉన్న స్థలంలో డార్మెంటరీ హాల్‌ను ఏర్పాటు చేశారు. ఎండాకాలం ఇబ్బందులు పడకుండా ఉండేందుకు శాశ్వత ప్రాతిపదికన రూ.60లక్షలతో చలువ పందిళ్లను ఏర్పాటు చేయనున్నారు. కొండపైనే భక్తుల కోసం మరుగుదొడ్లు, తదితర సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

భక్తులపై పార్కింగ్ భారం

ఏ దేవాలయంలోనూ లేనివిధంగా కొండపైన పార్కింగ్ రుసుములు వసూలు చేస్తుండటంతో స్వామివారి దర్శనం మరింత ప్రియం అయ్యింది. నాలుగుచక్రాల వాహనాల ప్రవేశ పార్కింగ్ రుసుము రూ.500, గంట సమయం దాటితే అదనంగా మరో రూ.100 వసూలు చేయాలని తొలుత నిర్ణయం తీసుకున్నారు. అయితే భక్తుల నుంచి పెద్దఎత్తున విమర్శలు రావడంతో రూ.500 తీసుకుంటున్నారు. లక్ష్మీనరసింహస్వామి దర్శనం ఖరీదైందని, కార్లలో వెళ్లి స్వామివారిని ఉచితంగా దర్శించుకోవాలన్న వారిపై రూ.500 వరకు భారంగా మారుతోందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కొండపైకి భక్తులు ఆర్టీసీ బస్సుల్లో కిక్కిరిసిపోయారు. పరిమితికి మించి ఆర్టీసీ బస్సుల్లో భక్తులు ప్రయాణిస్తున్నారు.



విల్లాల ఊసెత్తని వైటీడీఏ

స్వామివారిని దర్శించుకునే దేశ, విదేశాల నుంచి వచ్చే భక్తులకు తగినట్లు అత్యాధునికంగా సౌకర్యాలు కల్పించాలని యాదాద్రి ఆలయ అభివృద్ధి సంస్థ(వైటీడీఏ) ప్రణాళికను రూపొందించింది. కొండ కింద పెద్దగుట్టపై 900 ఎకరాల్లో టెంపుల్ సిటీ పేరుతో మొదటగా 250 కాటేజీలు, విల్లాలు నిర్మించేందుకు సన్నాహాలు చేసింది. పెద్దగుట్టపై ఐదు రకాల అధునాతన కాటేజీలు నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో భాగంగా ఒక్కో విల్లాను రూ.2కోట్లతో నిర్మించనున్నారు. వైటీడీఏ ప్రణాళికలు రూపొందించి మూడేళ్లు గడుస్తున్నా కార్యరూపం దాల్చడంలేదు.

కానరాని మౌలిక వసతులు

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఉద్ఘాటన జరిగి రెండేళ్లు కావొస్తున్నా, మౌలిక వసతులు మాత్రం కల్పించడంలేదు. యాదగిరిగుట్ట క్షేత్రాభివృద్ధిలో భాగంగా హరిహరుల ఆలయాల విస్తరణతో కూడిన పునర్నిర్మాణాల సంకల్పాన్ని చేపట్టిన వైటీడీఏ, టెంపుల్ సిటీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించలేకపోతోంది.



రూ.1280 కోట్లతో నిర్మాణం

యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడి ఆలయ ఉద్ఘాటన 2022 మార్చి 28న జరిగింది. ప్లవనామ సంవత్సర, ఫాల్గుణ బహుళ ఏకాదశి, సోమవారం, మిధున లగ్న పుష్కరాంశ సుముహూర్తమున ఉదయం 11.55గంటలకు ఏకశిఖర వాసుడి సన్నిధిలో ఏకకాలంలో మహాకుంభ సంప్రోక్షణ వైదికపర్వాలు నేత్రపర్వంగా కొనసాగాయి. ప్రధానాలయంతోపాటు విస్తరణ పనులు చేపట్టేందుకు 66 నెలలు పట్టింది. స్వామివారి దర్శనం పునః ప్రారంభమై రెండేళ్లయింది. ఆలయం పూర్తిగా కృష్ణశిలలతోనే నిర్మించారు. పలు ప్రాంతాల్లో విస్తరణ పనులు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. 2016 అక్టోబరు 11న విజయదశమి రోజున యాదాద్రీశుడి ఆలయ పునర్నిర్మాణ పనులకు నాటి సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టారు. ప్రధానాలయం, శివాలయం నిర్మాణానికి కృష్ణరాతి శిలలను వినియోగించారు. మొత్తం రెండున్నర లక్షల టన్నుల శిలలను ప్రకాశం, గుంటూరు జిల్లాల నుంచి సేకరించారు. ఆలయ నిర్మాణంలో స్థపతులతోపాటు 800 మంది శిల్పులు, ఎనిమిది మంది కాంట్రాక్టర్లు, దాదాపు 2వేల మంది కార్మికులు పాలుపంచుకున్నారు. ప్రధానాలయంలో 6వేలకు పైగా శిల్పాలను చెక్కారు. ప్రధానాలయ నిర్మాణానికి, విస్తరణకు రూ.1280కోట్లు వెచ్చించారు. కొండకింద గండి చెరువు సమీపంలో సువిశాల భవనాల్లో అధునాతన వసతులతో కల్యాణకట్ట, దీక్షాపరుల మండపం, ఉచిత అన్నప్రసాద భవనం, సత్యనారాయణస్వామి వ్రత మండపంతో పాటు భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు లక్ష్మీపుష్కరిణితోపాటు ఆర్టీసీ బస్టాండ్, టెంపుల్ బస్ టర్మినల్ నిర్మించారు. కొండమీద, కొండకింది నుంచి మురుగు నీటిని శుద్ధి చేసేందుకు సివరేజ్ ప్లాంట్ నిర్మించారు. అటవీశాఖకు చెందిన 500 ఎకరాల్లో నారసింహ అభయారణ్యం, జింకల పార్కులను ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు.

సదుపాయాలు ఇంకా మెరుగుపర్చాలి



అంతర్జాతీయ స్థాయిలో అద్భుత ఆలయం నిర్మించినా.., అదేస్థాయిలో సరైన సదుపాయాలు లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొండపైన అద్దె గదులు, మొబైల్ మరుగుదొడ్లు, మూత్రశాలలు రద్దీకి అనుగుణంగా ఏర్పాటు చేయాలి. అదేవిధంగా వేసవి దృష్ట్యా శాశ్వతంగా భక్తులు సేద తీరేందుకు చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలి. ఎప్పటికీ మంచినీళ్ల కులాయిలు పని చేసేలా.. నీటిని సరఫరా చేసి భక్తుల దాహం తీర్చాలి.

- కోల వెంకటేష్, స్థానిక భక్తుడు, యాదగిరిగుట్ట

ఆధ్యాత్మిక కేంద్రంగా..

శతాబ్దాల చరితగల మహిమాన్విత స్వయంభు యాదగిరిగుట్ట దివ్యక్షేత్రం ఆధ్యాత్మికనగరిగా కొత్తరూపు సంతరించుకుంది. దాదాపు ఎనిమిది శతాబ్దాల తర్వాత రాజులకాలం నాటి భారీ కృష్ణరాతిశిలలతో శిల్ప నిర్మాణాలు కొనసాగాయి. స్వామివారి విమాన గోపురం, ధ్వజస్తంభం, బలిపీఠం, గర్భాలయ ముఖద్వారాలకు స్వర్ణతాపడంతో భక్తజన బాంధవుడి ఆలయం బంగారుమయంగా తీర్చిదిద్దారు. హరిహరులకు నిలయంగా శివాలయాన్ని పునర్నిర్మించారు. 14 ఎకరాల విస్తీర్ణపు కొండనే కాదు.. పరిసరాల నవగిరులతో దాదాపు 2వేల ఎకరాల్లో ఆధ్యాత్మిక విశ్వనగరిగా తీర్చిదిద్దారు. యాదగిరిగుట్ట అభివృద్ధికి సుమారు రూ.1280కోట్లతో అభివృద్ధి ప్రణాళికలు అమలుకు ప్రత్యేకంగా యాదగిరిగుట్ట టెంపుల్‌డెవలప్ మెంట్ అథారిటీ(వైటీడీఏ)ను ఏర్పాటు చేయడమే కాకుండా... ఆయనే చైర్మన్‌గా కేసీఆర్ అభివృద్ధి పనులను స్వయంగా పర్యవేక్షించారు. స్వామి సన్నిధికి ఆలయ పునర్నిర్మాణం అనంతరం భక్తుల తాకిడి పెరిగింది. గతంలో తాత్కాలికంగా బాలాలయంలో ప్రతిష్ఠించిన కవచమూర్తులను రోజువారీగా 6వేల నుంచి 10వేల మంది భక్తులు రాగా, సెలవురోజుల్లో దాదాపు 30వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకునేవారు. ఆలయ పునర్నిర్మాణం తర్వాత రోజువారీగా 15వేలకు పైగా.. సెలవురోజుల్లో 45వేల మంది దర్శించుకుంటున్నారు.



యాదగిరికొండపై భక్తులు

సిబ్బందికి రెండు రోజులపాటు శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

భువనగిరి అర్బన్, మార్చి 27: లోక్‌సభ ఎన్నికల కోసం సిబ్బందికి రెండు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ హనుమంతు కే.జెండగే తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం పీవో, ఏపీవోల శిక్షణ ఏర్పాట్లను సమీక్షించిన అనంతరం ఆయన మాట్లాడారు. వచ్చేనెల 1, 2 తేదీల్లో రెండు రోజులపాటు శిక్షణ కొనసాగుతుందన్నారు. జిల్లాకేంద్రంలోని వెన్నెల కళాశాలలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు, తిరిగి 1.30 నుంచి సాయంత్రం 5.30గంటల వరకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతీ ఉద్యోగి అందుబాటులో ఉండాలని, గైర్హాజరైన వారిపై తగిన చర్యలు ఉంటాయన్నారు. ఎన్నికల్లో పీవో, ఏపీవోల పాత్ర అత్యంత కీలకమని, పోలింగ్ రోజు విధుల్లో నిబద్ధతతో ఉండాలని, ఈవీఎంలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాలు ఉన్న ప్రాంతం, ఓటర్ల వివరాలు తెలిపే బోర్డులు, ఫాం-7లో పోటీలోని అభ్యర్థుల జాబితాను పోలింగ్ కేంద్రం బయట ప్రదర్శించాలన్నారు. సమీక్షలో రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్ షాలోమ్, భువనగిరి, చౌటుప్పల్ ఆర్డీవోలు అమరేందర్, శేఖర్‌రెడ్డి, నోడల్ అధికారులు కే.నారాయణరెడ్డి, ఎం.జయపాల్‌రెడ్డి, విద్యాసాగర్, కలెక్టరేట్ ఏవో సీ.జగన్మోహన్ ప్రసాద్, నర్సిరెడ్డి, హరినాథరెడ్డి, పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు : కలెక్టర్

జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అధికారులను ఆదేశించారు. తాగునీటి ఎద్దడి నివారణపై కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో నీటి లభ్యత, సరఫరాలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగాలన్నారు. పైపులైన్ లీకేజీలను అరికట్టి నీరు వృథా కాకుండా చూడాలన్నారు. పని చేయని చేతి పంపులు, బోరు పంపుల మరమ్మతులు వెంటనే చేపట్టాలన్నారు. సమీక్షలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, జడ్పీ సీఈవో శోభరాణి, డీఆర్డీవో ఎం.ఏ కృష్ణన్, డీపీ వో సునంద, ఆర్‌డబ్ల్యూఎస్ సూపరింటెండెంట్ ఇంజనీరు కృష్ణయ్య పాల్గొన్నారు.

కల సాకారమయ్యేనా..?

- ఆలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై నిరీక్షణ
- నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించి మోసం చేసిందంటున్న ప్రజలు
- ప్రస్తుత అధికార పార్టీ ఆ దిశగా అడుగులు వేసేనా?
- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య వాగ్దానం నిలబెట్టుకోవాలి : స్థానికులు



ఆలేరు రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అఖిలపక్షం నాయకులు(ఫైల్)

ఆలేరు రూరల్, మార్చి 27: ప్రజా ఉద్యమాలకు పుట్టినిల్లుగా, రాజకీయ చైతన్య వేదికగా, చారిత్రక, సాంస్కృతిక కేంద్రంగా ఆలేరుకు ఎంతో పేరుంది. వీరశైవ, జైన, వైష్ణవ మతాలు సమాదరణతో పరిఢవిల్లిన ప్రాంతమిది. నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి ఊపిరి పోసిన ప్రాంతం, నేటి మలిదశ ఉద్యమానికి ఊపిరై 1952 నుంచి అసెంబ్లీ కేంద్రంగా ఉన్న ప్రాంతం. ఆరుట్ల రాంచంద్రారెడ్డి, కమలాదేవి, కట్కూరి రాంచంద్రారెడ్డి, సుశీలా దేవి, ఏసురెడ్డి నర్సింహారెడ్డి, రేణికుంట రాంరెడ్డి, బెల్లకొండ లింగయ్య, దుంపల మల్లారెడ్డి లాంటి గొప్ప వీరులను కన్న నేల. ఇంతటి ఘన చరిత్ర కలిగిన ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా మార్చాలని ఎన్నో ఏళ్లుగా ఇక్కడి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇక్కడికి వచ్చే ప్రజాప్రతినిధులను, అధికారులను కలిసి విన్నవించుకుంటున్నా ఆలకించే వారే లేరు.

అన్నీ అర్హతలు ఉన్నా

ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా మార్చేందుకు అన్ని అర్హతలు ఉన్నాయి. 70 ఏళ్లుగా అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంగా కొనసాగుతోంది. తెలంగాణలోనే అతిపెద్ద నియోజకవర్గ కేంద్రం. ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేసేందుకు స్థలం కూడా ఉంది. అయినా ఎందుకు డివిజన్ కావడం లేదోనని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. జనాభా సైతం చదరపు కిలోమీటరుకు 1020 మంది ఉన్నారు.

ఐదు మండలాలతో ప్రతిపాదనలు

ఆలేరు, యాదగిరిగుట్ట, మోటకొండూరు, గుండాల, రాజాపేట మండలాలతో కలిపి ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కోరుతూ గత ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సునీత 2021లో నాటి ప్రభుత్వానికి లేఖ రాశారు. ప్రభుత్వ ఆదేశానుసారం 21 మే 2021న నాటి కలెక్టర్ అనితా రామచంద్రన్ అన్ని అర్హతలు ఉన్న ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ఆలేరు రెవెన్యూ డివిజన్ అయ్యిందని సంబురాలు చేసుకున్నా జీవో, గెజిట్ మాత్రం రాలేకపోయింది.

ఐదేళ్లుగా కొనసాగుతున్న ఉద్యమాలు

ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షం, ప్రజా సంఘాలు, రెవెన్యూ డివిజన్ పోరాట కమిటీ ఐదేళ్లుగా ఉద్యమాలు చేస్తూనే ఉన్నాయి. సుదీర్ఘ పోరాటాలు చేస్తున్నా రెవెన్యూ డివిజన్ కల నెరవేరడం లేదు. కలెక్టర్, మంత్రులకు వినతిపత్రాలు ఇచ్చినా, దీక్షలు, రాస్తారోకోలు, బంద్‌లు నిర్వహించినా ఆలేరు ప్రజల చిరకాల వాంఛ నెరవేర్చలేకపోయారు. ఎన్నికల సందర్భంగా హామీలు ఇచ్చిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రస్తుత విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యలు ఆలేరును రెవెన్యూ డివిజన్ చేసే దిశగా దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

72 రెవెన్యూ గ్రామాలు.. 96 గ్రామ పంచాయతీలు

ఆలేరును ఐదు మండలాలతో కూడిన రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసేందుకు 96 గ్రామ పంచాయతీలు ఉండగా, 72 రెవెన్యూ గ్రామ పంచాయతీలున్నాయి. ఈ ఐదు మండలాల్లో 1,83,028 మంది జనాభా ఉంది. భౌగోళికంగా రెవెన్యూ డివిజన్ కేంద్రానికి ఆ మండలాలకు భవన సౌకర్యాలు ఉన్నాయి. ఆలేరు 163వ జాతీయ రహదారితో ఉండడం, తెలంగాణకే తలమానికమైన యాదగిరిగుట్ట, దేశంలోనే ప్రముఖ శ్రీ స్వయంభూ సోమేశ్వరాలయం, వీరనారాయణ ఆలయం, శ్వేతాంబర జైనాలయం ఉండడం విశేషం.

ప్రభుత్వం సర్వే చేయించాలి



రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపై ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రభుత్వంచే సర్వే చేయించాలి. గెజిట్ నోటిఫికేషన్ ఇప్పించాలి. గత ప్రభుత్వ మాదిరిగా మోసం చేయకుండా ఆలేరు ప్రజలకిచ్చిన మాటలను నిలబెట్టుకోవాలి. ఆలేరు అభివృద్ధి చెందాలంటే రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాల్సిందే.

- పసుపునూరి వీరేశం, కన్వీనర్, ఆలేరు రెవెన్యూ డివిజన్ సాధన కమిటీ

100 రోజులు దాటినా స్పష్టత లేదు



ప్రభుత్వం ఏర్పడి 100 రోజులవుతున్నా రెవెన్యూ డివిజన్‌పై మంత్రి కోమటిరెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యలు ఇచ్చిన వాగ్దానం నెరవేరలేదు. అన్ని అర్హతలు ఉన్న ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా చేయకుండా నాటి పాలకులు మోసం చేశారు. మాట ఇచ్చి తప్పిన గొంగిడికి ప్రజలు తగిన బుద్ధి చెప్పారు. ప్రభుత్వం ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య స్పందించి ఇచ్చిన హామీలు నెరవేర్చాలి.

- ఆర్ జనార్థన్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి.

వరిసాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ రామకృష్ణబాబు



సమావేశంలో రైతులనుద్దేశించి మాట్లాడుతున్న రామకృష్ణబాబు

భూదాన్‌పోచంపల్లి, మార్చి 27: వరి సాగులో రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డాక్టర్ రామకృష్ణబాబు అన్నారు. భూదాన్‌పోచంపల్లి మండలంలోని పెద్దరావులపల్లి రైతు వేదికలో వరిసాగులో సమగ్ర సస్యరక్షణ చర్యలపై ఇంద్రియాల, గౌసుకొండ, రామలింగంపల్లి గ్రామాల గిరిజన రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో ఎక్కువగా ఆశించే కాండం తొలుచు పురుగు, అగ్గితెగులు నివారణకు రైతులు ఇష్టం వచ్చినట్లు పురుగు మందులు వాడి పెట్టుబడి ఖర్చులు పెట్టుకుంటున్నారని, తద్వారా పురుగు మందులు తట్టుకునే గుణంతోపాటు పర్యావరణాన్ని కూడా కలుషితం చేస్తున్నారన్నారు. ఈ సమస్యను అధిగమించడానికి సమగ్ర వ్యవసాయ పద్ధతిలో జీవ నియంత్రణ పద్ధతులను వాడితే పంటలో ఉన్న పురుగులు, తెగుళ్లను సహజంగా అరికట్టడానికి వీలవుతుందన్నారు. ఏరువాక జిల్లాకేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ రైతులు కాండం తొలుచు పురుగు నివారణకు లింగాకర్షణ బుట్టలను ఎలా ఉపయోగించాలో వివరించారు. సదస్సులో జిల్లా వ్యవసాయశాఖ ఉపసంచాలకులు భూక్యా దేవ్‌సింగ్, మండల వ్యవసాయాధికారి ఎజాజ్ అలీఖాన్, ఏఈవోలు శిరీష, పవిత్రం, రాజశేఖర్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

మోత్కూరు, మార్చి 27: యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని కొండగడప గ్రామంలో అధికారులు బుధవారం బాల్య వివాహాన్ని అడ్డుకున్నారు. బాలికకు వివాహం చేస్తున్నారని తెలుసుకున్న జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది కవిత, ఏఎస్ఐ వెంకన్న, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ దశరథ ఆ గ్రామానికి చేరుకుని తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి వివాహాన్ని నిలిపి వేయించారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలు, బాల్య వివాహ నిరోధక చట్టాలపై వారికి అవగాహన కల్పించారు. బాలికను, ఆమె తల్లిదండ్రులను జిల్లా బాలల సంక్షేమ సమితి ఎదుట హాజరుపర్చారు. బాల్య వివాహాలు చేయిస్తున్నట్లు తెలిస్తే చైల్డ్ హెల్ప్ లైన్ నంబరు 1098కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని వారు కోరారు.

యాదగిరిగుట్ట ఆలయం అద్భుతం

● భారత నావికా దళాధిపతి అడ్మిరల్ హరికుమార్


హరికుమార్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఈవో భాస్కర్‌రావు

భువనగిరి అర్బన్, మార్చి 27: యాదగిరిగుట్ట ఆలయం అత్యద్భుతంగా నిర్మితమైందని, తాను సందర్శించిన ఆలయాల్లో కెల్లా ఇక్కడి ఆలయం శిల్పకళా సౌందర్యంతో భక్తి భావం పెంపొందిస్తోందని భారత నావికా దళాధిపతి అడ్మిరల్ ఆర్.హరికుమార్ అభివర్ణించారు. బుధవారం యాదగిరిగుట్ట క్షేత్రాన్ని ఆయన కుటుంబ సమేతంగా సందర్శించారు. ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి ఆశీర్వచనం చేయగా, ఈవో ఏ. భాస్కర్‌రావు లడ్డూ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా అడ్మిరల్ హరికుమార్ మాట్లాడుతూ ఆలయ నిర్మాణశైలిలో ఆధ్యాత్మికత ఉట్టిపడుతోందన్నారు. స్వామిని దర్శించుకున్న పవిత్ర అనుభూతి కలిగిందన్నారు. ఈవోను ప్రత్యేకంగా అభినందిస్తూ ఆలయ నిర్వహణ తీరును కొనియాడారు. ఈ కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, అర్చకులు, వేద పండితులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

● యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలంలో ఘటన



పంచాయతీ కార్యదర్శి కిరణ్

మోత్కూరు, మార్చి 27: ఇంటి పన్ను నిర్ధారిత ధ్రువీకరణ పత్రం ఇచ్చేందుకు రూ.3వేలు లంచం తీసుకుంటూ ఓ పంచాయతీ కార్యదర్శి అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులకు చిక్కాడు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం పొడిచేడులో ఈ సంఘటన జరిగిం ది. ఇందుకు సంబంధించిన వివరా లను ఏసీబీ డీఎస్పీ జగదీష్‌చందర్ తెలిపారు. మోత్కూరు మండలం పొడిచేడు గ్రామానికి చెందిన గొరిగె మహేష్ నూతనంగా నిర్మించుకున్న ఇంటికి పన్ను నిర్ధారిత ధ్రువీకరణ పత్రం కోసం కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. ఇందుకోసం కార్యదర్శి చిన్నం కిరణ్ లంచం ఇవ్వాలని డిమాండ్ చేయగా, మహేష్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. అధికారుల సూచన మేరకు కార్యదర్శి కిరణ్‌కు రూ.3వేలు లంచం ఇస్తుండగా అదుపులోకి తీసుకు న్నట్లు డీఎస్పీ తెలిపారు. కిరణ్‌ను ఏసీబీ కోర్టులో ఫస్ట్‌క్లాస్ అదనపు స్పెషల్ జడ్జి ఎదుట హాజరు పర్చుతామన్నారు. బాధితుడు మహేష్ మాట్లాడుతూ పంచా యతీ కార్యదర్శి తనను రూ.8వేలు డిమాండ్ చేయగా, రూ.5వేలు పంచాయతీ కారోబార్ బంగారి ద్వారా పంపించానన్నారు. కిరణ్ తనను వదలకుండా మిగతా రూ.3వేలు ఇవ్వాలని పదే పదే అడుగుతుండటంతో ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశానన్నారు.

పట్టపగలు ఇంట్లో చోరీ

దేవరకొండ, మార్చి 27: నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణం హనుమాన్ నగర్‌లోని ఓ ఇంట్లో బుధవారం పట్టపగలు చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమాన్‌నగర్‌లోని శ్రీనివాస్‌రావు అనే పెయింటింగ్ కాంట్రాక్టర్ ఇంట్లో కుటుంబ సభ్యులు ఇంట్లోలేని సమయంలో దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువాను పగలగొట్టి అందులో ఉన్న నాలుగు తులాల బంగారు ఆభరణాలు, రూ.50వేల నగదు అపహరించారు. శ్రీనివాసరావు పెయింటింగ్ కాంట్రాక్టర్ కాగా పనిమీద బయటకు వెళ్లాడు. ఆయన భార్య కూడా కొండమల్లేపల్లికి వెళ్లింది. ఇంట్లో ఎవరూలేని సమయంలో దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడినట్లు బాధితుడు శ్రీనివాసరావు తెలిపారు. గమనించిన ఇరుగు, పొరుగువారు శ్రీనివాసరావుకు సమాచారం ఇచ్చారు. ఇంటికి వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు శ్రీనివాసరావు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపారు.

ఎలక్ట్రికల్ షాప్‌లో అగ్ని ప్రమాదం



అగ్నిప్రమాదంలో దగ్ధమైన సామగ్రి

భూదాన్‌పోచంపల్లి, మార్చి 27: యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని ఓ ఎలక్ట్రికల్ దుకాణంలో మంగళవారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. ఎలక్ట్రికల్ షాప్‌లోని సామగ్రి పూర్తిగా కాలిపోయింది. సీత శేఖర్ మంగళవారం రాత్రి 9గంటలకు తన ఎలక్ట్రికల్ దుకాణాన్ని మూసివేసి ఇంటికి వెళ్లాడు. రాత్రి 10:30 గంటల సమయంలో దుకాణం పక్కనే ఉన్న చికెన్ షాప్ యజమాని ఫోన్ చేసి ఎలక్ట్రికల్ షాప్ నుంచి మంటలు వస్తున్నాయని శేఖర్‌కు సమాచారం ఇచ్చాడు. శేఖర్ వచ్చి చేసే సరికి దుకాణం పూర్తిగా కాలిపోయింది. స్థానికుల సాయంతో మంటలు ఆర్పారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సుమారు రూ.6లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు శేఖర్ తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

అర్వపల్లి: సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన గోళ్ల మహేందర్ ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో బుధవారం దగ్ధమైంది. సూర్యాపేట నుంచి వచ్చిన ఫైరింజన్‌తో మంటలు ఆర్పారు. ఇంట్లో ఉన్న ఫ్యాన్లు, టీవీ, ఫ్రిజ్, బియ్యం బస్తాలు, ధాన్యం బస్తాలు, దుస్తులు, నగదు రూ.లక్ష పూర్తిగా కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.4లక్షల ఆస్తి నష్టం వాటిలినట్లు బాధితుడు తెలిపారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

మిర్యాలగూడ అర్బన్, మార్చి 27: హైటెక్‌హంగుల తెరవెనుక గుట్టుగా సాగిపోతున్న వ్యభిచారంపై పోలీసులు దృష్టిసారించారు. ఏపీ రాష్ట్రసరిహద్దులో ఉన్న నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో కొందరు మహిళలు విటులను రప్పించి వలపు వల వేస్తున్నారు. విటులను ఆకర్షించేందుకు వాట్సాప్ ఇతర సోషల్‌మీడియా మార్గాల్లో స్మార్ట్‌గా వల వేస్తున్నారు. పట్టణ శివారు కాలనీలో విసిరేసినట్లుగా ఉండే భవాలను అద్దెకు తీసుకొని వ్యభిచారం సాగిస్తున్నట్లు తెలుస్తోంది. 20- 35 ఏళ్లలోపు యువతులతో వ్యభిచారం సాగిస్తున్నట్లుగా పోలీసులకు విశ్వసనీయంగా సమాచారం అందింది. దీంతో బుధవారం నల్లగొండజిల్లా మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్‌బోర్డుకాలనీలలో వన్‌టౌన్ పోలీసులు ఆకస్మికంగా దాడిచేశారు. ఓ మూడు ఇండ్లలో ఉన్న 10మంది మహిళలతోపాటు ఓ విటుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఈ వ్యవహారం ఎప్పటి నుంచి నడుస్తుంది..? దీనివెనుక ఉన్న సూత్ర, పాత్రదారులెవరు.. ఎక్కడెక్కడినుంచి విటులను రప్పిస్తున్నారు..? పట్టుబడ్డ యువతులు ఏ ప్రాంతానికి చెందినవారన్న దానిపై లోతైన విచారణ సాగిస్తున్నట్లు పోలీస్ వర్గాలు తెలిపాయి. విచారణ పూర్తయిన అనంతరం వివరాలు వెల్లడించే అవకాశం ఉంది.

రూ.లక్ష నగదు స్వాధీనం



విచారణ నిర్వహిస్తున్న పోలీసులు

పెన్‌పహాడ్, మార్చి 27: సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం పొట్లపహాడ్ క్రాస్ రోడ్డు వద్ద బుధవారం పెన్‌పహాడ్ ఎస్ రవీందర్ తన పోలీస్ సిబ్బందితో వాహనాలను తనిఖీ చేశారు. గరిడేపల్లి నుంచి మహబూబాబాద్ జిల్లా మర్రిపేట వెళ్తున్న కారులో ఎలాంటి పత్రాలు లేకుండా లక్ష రూపాయలు తరలిస్తుండగా పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. రూ.50 వేల కంటే ఎక్కువ తీసుకెళ్తే ఆ నగదు పట్టుబడితే సీజ్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెన్‌పహాడ్ పోలీస్ సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

లైంగికదాడి ఘటనలో నిందితుడి రిమాండ్


చౌటుప్పల్ రూరల్, మార్చి 27: ఆడిస్తానంటూ తీసుకెళ్లి.. రెండేళ్ల బాలికపై అత్యాచారం చేసిన ఘటనలో నిందితుడిని యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. చౌటుప్పల్ కోర్టులో హాజరుపెట్టిన అనంతరం మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు నిందితుడిని నల్లగొండ జైలుకు తరలించినట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 25 ఏళ్ల శివ చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలోని ఓ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తూ అక్కడే ఓ గదిలో ఉంటున్నాడు. అక్కడే ఉంటున్న దంపతుల రెండేళ్ల బాలికను ఆడిస్తానంటూ సోమవారం సాయంత్రం తీసుకెళ్లి లైంగికదాడి చేశాడు. చిన్నారిని ఇంటి సమీపంలో వదిలివెళ్లటంతో విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో శివను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు. చిన్నారి నిలోఫర్ అసుపత్రిలో చికిత్సపొందుతోందని, ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

తిరుమలగిరి(సాగర్), మార్చి 27: నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలంలోని మండలంలోని అల్వాల గ్రామంలో బుధవారం విద్యుదాఘాతంతో పాడి గేదె మృతిచెందింది. బాధిత రైతు రావులపాటి సైదులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన సైదులు పాడి గేదెను పెంచుకుంటూ పాల ద్వారా తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజు మాదిరిగానే మేతకు వెళ్లిన గేదె విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ బుష్ వైర్‌ను తాకడంతో అక్కడికక్కడే మృతిచెందింది. గేదె విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని సైదులు కోరాడు.

వైబ్రెంట్ తెలంగాణ అమలైతే..

» రూరల్ తెలంగాణ పరిధిలో నల్లగొండ, సూర్యాపేట జిల్లాలు? » యాదాద్రి సగం జిల్లా హెచ్‌ఎండీఏ పరిధిలోకి » మిగితా సగం రూరల్‌గా



భువనగిరి టౌన్, మార్చి 27: దేశంలో 29వ రాష్ట్రంగా పదేళ్ల క్రితం ఏర్పడిన తెలంగాణ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వైబ్రెంట్ తెలంగాణ- 2050 ప్రణాళికలు రూపొం దిస్తోం ది. తెలంగాణ రాష్ట్రాన్ని మూడు భాగాలుగా విభజించి అభివృద్ధి చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల ప్రకటించారు. అలాగే ఇటీవల వరకు విస్తృతంగా ప్రచారం జరిగి న గ్రేటర్ సిటీ కార్పొరేషన్ ఏర్పాటుపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. ఈ మేరకు హైదరాబాద్ నగరం చుట్టూ ఉన్న ఔటర్ రింగురోడ్డు(ఓఆర్‌ఆర్) లోపలి వైపున్న ప్రాంతాలన్నింటినీ గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) పరిధిలోకి, ఓఆర్‌ఆర్ నుంచి రీజనల్ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) మధ్యలో ఉన్న ప్రాంతాలు హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) పరిధిలోకి వెళ్లనున్నాయి. ఆర్‌ఆర్‌ఆర్ నుంచి తెలంగాణ సరిహద్దుల వరకు ఉన్న ప్రాంతాన్ని రూరల్ తెలంగాణగా రాష్ట్ర ప్రభుత్వం పరిగణించనుంది.

దీంతో హైదరాబాద్ నగర పరిధిని విస్తృతం చేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఎనిమిది మండలాలను లేదా మూడు మునిసిపాలిటీలను కలుపుతూ గ్రేటర్ సిటీ కార్పొరేషన్ ఏర్పాటు కానుందని ఇటీవలి వరకు విస్తృత ప్రచారం జరిగినా ఇప్పటికిప్పుడు ప్రభుత్వానికి అలాంటి ఆలోచన లేదని స్పష్టమవుతోంది.

ప్రభుత్వ ఆలోచన నిజమైతే..

వైబ్రెంట్ తెలంగాణ -2050 ప్రణాళిక నిజమైతే ఉమ్మడి జిల్లా సత్వర అభివృద్ధికి చెందుతుందని పలు రంగాల నిపుణులు అంటున్నారు. ఇప్పటి వరకు పలు కారణాలతో అభివృద్ధిలో వెనుకబడిన ప్రాంతాలన్నింటినీ అభివృద్ధి చేసే లక్ష్యంతో ప్రతిపాదిస్తున్న వైబ్రెంట్ తెలంగాణ-2050తో ఆయా ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తారని, అందుకు అవసరమైన నిధుల కేటాయింపు, మంజూరు సులభతరం అవుతుందని అంటున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాను రూరల్ తెలంగాణ, హెచ్‌ఎండీఏ కేటగిరీలుగా పరిగణించనున్న నేపథ్యంలో పాలన పరమైన, రాజకీయ, భౌగోళిక, జిల్లాల ముఖ చిత్రాలు కూడా మారే అవకాశాలు ఉంటాయని అంటున్నారు. జూన్ 6తో ముగిసే పార్లమెంట్ ఎన్నికల కోడ్ అనంతరమే ప్రభుత్వ నూతన ప్రణాళికపై స్పష్టత రానుంది.

ఇటీవల సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలు



ఔటర్ రింగురోడ్డు లోపలి వైపు ఉన్న సిటీ మొత్తాన్ని గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) పరిధిలోకి తీసుకొస్తామని, ఔటర్ నుంచి రీజినల్ రింగురోడ్డు మధ్యలో ఉన్న ప్రాంతాన్ని హెచ్‌ఎండీఏ పరిధిలోకి తీసుకొస్తామని సీఎం ప్రకటించారు. రీజనల్ రింగు రోడ్డు నుంచి తెలంగాణ సరిహద్దుల వరకు ఉన్న ప్రాంతాన్ని రూరల్ తెలంగాణగా పరిగణించి అభివృద్ధి చేస్తామని వివరించారు. వైబ్రెంట్ తెలంగాణ-2050 సాధనే లక్ష్యంగా ప్రణాళికలు తయారు చేస్తామని ప్రకటించారు.

మారనున్న ఉమ్మడి జిల్లా స్వరూపం...?

వైబ్రెంట్ తెలంగాణ-2050 సాధనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందిస్తున్న ప్రణాళికతో ఉమ్మడి జిల్లా సమగ్ర స్వరూపం మారనున్నది. సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనలకు కార్యరూపం వస్తే పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసే నాటికి రూపొందించనున్న ప్రణాళికలతో నల్లగొండ, సూర్యాపేట జిల్లాలు రూరల్ తెలంగాణ పరిధిలోకి, యాదాద్రి భువనగిరి జిల్లాలోని 17 మండాలాల్లో 8 మండలాలు హెచ్‌ఎండీఏ పరిధిలోని మిగతా 9 మండలాలు రూరల్ తెలంగాణలోకి వెళ్లనున్నాయి. కానీ జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉమ్మడి జిల్లాలోని ఏ ఒక్క ప్రాంతం కూడా విలీనం అయ్యే అవకాశాలు లేనట్లేనని ప్రచారం అవుతోంది. అలాగే జిల్లాల పునర్విభజన కూడా సక్రమంగా జరగలేదని నేటి ప్రభుత్వం ఇటీవల సీఎం పలుమార్లు పేర్కొన్న నేపథ్యంలో వైబ్రెంట్ తెలంగాణ-2050 ప్రణాళికలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ప్రణాళికలో భాగంగా మరోమారు జిల్లాల పునర్విభజనకు కూడా అవకాశాలు ఉంటాయనే చర్చ జరుగుతోంది.

చిత్తశుద్ధి ఉంటే లక్ష్యం సాధ్యమే



రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించి అభివృద్ధి చేయాలని రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదిస్తున్న వైబ్రేంట్ తెలంగాణ -2050 ప్రణాళిక మంచిదే. కానీ పాలకులకు చిత్తశుద్ధి ఉంటేనే ప్రణాళిక అమలు సాధ్యం. ప్రణాళిక అమలుకు ఖచ్చితంగా కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరం. కానీ పాలనకంటే రాజకీయమే ముఖ్యమని ఇటీవలి వరకు రాష్ట్ర ప్రభుత్వ పాలన సాగిన విషయం విదితమే. తిరిగి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఆవే రాజకీయ బేధాభిప్రాయాలు కొనసాగితే మాత్రం నూతన ప్రణాళిక విఫల ప్రయోగంగా మిగులుతుంది.

- సింగనబోయిన సత్యనారాయణ, విశ్రాంత మునిసిపల్ కమిషనర్.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి

కోదాడటౌన్, మోతె, పెద్దవూర, మఠంపల్లి, మార్చి 27: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. వరంగల్ జిల్లా హసన్‌పర్తిలో జరిగిన మరో ప్రమాదంలో సూర్యాపేట జిల్లా మఠంపల్లి వాసి మృతిచెందాడు. సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణం సమీపంలోని ఎస్ఆర్ఎం పాఠశాల వద్ద మంగళవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. అర్ధరాత్రి కావడంతో మృతదేహాన్ని గుర్తించకుండా వాహనాలు వెళ్లడంతో శరీరం నుజ్జు నుజ్జయింది. బుధవారం స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సీఐ రాము తెలిపారు. షార్ట్ మినహా, శరీరంపై చొక్కా ఆనవాలు లేవని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో మృతదేహాన్ని ఉంచినట్లు తెలిపారు. గుర్తుతెలియని మృతదేహం కింద కేసు నమోదు చేస్తు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొని..

సూర్యాపేట జిల్లా మోతె మండలకేంద్రంలో బుధవారం తెల్లవారుజామున రోడ్డు వెంట ఆగిఉన్న వాహనాన్ని వెనకాల నుంచి బైక్ ఢీకొని యువకుడు మృతిచెందాడు. ఏపీ రాష్ట్రం కృష్ణాజిల్లా నందివాడ గ్రామానికి చెందిన ఉండవల్లి నవీన్‌కుమార్(25) చౌటుప్పల్ పరిధిలోని దివీస్ లాబోరేటరి కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. తన కంపెనీ సమీపంలోనే ఖమ్మం జిల్లాకేంద్రానికి చెందిన తన స్నేహితుడు కె. శివ వంశీరబ్బర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. శివను ఖమ్మంలో బైక్‌పై వదిలివెళ్లడానికి ఇద్దరు కలిసి మంగళవారం బయలుదేరారు. బుధవారం తనకు డ్యూటీ ఉండడంతో ఖమ్మంలో శివను వదిలి తెల్లవారుజామున ఖమ్మం నుంచి అదే బైక్‌పై వస్తుండగా మోతె గ్రామ శివారులో ఉన్న ఫ్లైఓవర్ వద్ద రోడ్డు వెంట ఆగి ఉన్న లారీని వెనకాల ఢీకొట్టింది. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో గాయాలైన నవీన్‌ను సూర్యాపేట ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతు బుధవారం సాయంత్రం మృతిచెందాడు నవీన్ సోదరుడు ఉండవల్లి వెంకటనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి తెలిపారు.

కారు ఢీకొని యువకుడు..



పోలెపల్లి గోపి(ఫైల్)

నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలం బోయగూడెం గ్రామానికి చెందిన పోలెపల్లి గోపి(27), కటికల మధు టీఎస్ 05ఎఫ్‌హెచ్9326 నెంబర్‌గల బైక్‌పై బోయగూడెం నుంచి మల్లేపల్లి వైపు వెళ్తున్నారు. పెద్దవూర మండల కేంద్రంలోని కాటన్‌మిల్లు వద్ద జాతీయ రహదారి-167 సమీపంలోకి రాగానే హైదరాబాద్‌కు చెందిన అవుతు కోటిరెడ్డి హైదరాబాద్ నుంచి అజాగ్రత్తగా అతి వేగంగా కారును నడుపుతూ బైక్‌ను ఢీకొన్నాడు. దీంతో గోపి, మధు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు నాగార్జునసాగర్‌లోని కమలానెహ్రూ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పోలేపల్లి గోపి(27) మృతిచెందాడు. గాయపడిన కటికల మధును మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. గోపికి భార్య జ్యోతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గోపి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దవూర ఎస్ఐ వీరబాబు తెలిపారు.

వరంగల్ జిల్లాలో రోడ్డు ప్రమాదం.. మఠంపల్లి వాసి మృతి



మోహన్ (ఫైల్)

వరంగల్ జిల్లా హసన్‌పర్తిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల వాసి మృతిచెందాడు. మఠంపల్లి మండలంలోని ఉమ్మడి భీల్యానాయక్‌తండా పరిధిలో గల బక్కలచ్చితండాకు చెందిన బానోతు మోహన్(35) వృత్తిరీత్యా లారీ డ్రైవర్ పని చేస్తుండేవాడు. స్థానిక సాగర్ సిమెంట్స్ నుంచి మంగళవారం లారీ లోడుతో బయలు దేరిన మోహన్ బుధవారం వరంగల్- కరీంనగర్ ప్రధాన రహదారిపై గేదెలను తప్పించబోయి రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వేగంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మోహన్ శరీర భాగం నుజ్జునుజ్జై అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో భీల్యానాయక్‌తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. మోహన్‌కు భార్య సుజాత, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మేకను కాపాడబోయి..

యాదగిరిగుట్ట రూరల్, మార్చి 27: మేకను కాపాడ బోయి చేపల చెరువులో పడి యవకుడు మృతిచెందాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మం డలంలోని మల్లాపురం గ్రామంలో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కర్రె నర్సింహులు, పారిజాత దంపతుల పెద్ద కుమారుడు నవీన్(27) తన వ్యవసాయ బావి సమీపంలో హైదరాబాద్‌కు చెందిన రఫీ అనే వ్యక్తికి చెందిన చేపల చెరువు ఉంది. తన మేక చెరువులోకి వెళ్లిందని దానిని తీసుకరావడానికి నవీన్ చెరువులోకి దిగాడు. చెరువు లోతుగా ఉండడంతో ఈతరాని చెరువులో మునిగి ఊపిరాడక అందులోనే మృతిచెందాడు. వ్యవసాయ బావివద్దనే ఉన్న తల్లిదండ్రులు గమనించి తమ కుమారుడు ఇప్పటి వరకు రాలేదని చెరువు వద్దకు వెళ్లి చూసేసరికి చెరువులో నుంచి మేక బయటకు వచ్చింది. నవీన్ చెరువులోనే పడిపోయాడని వారు కేకలు వేయడంతో అక్క డున్న వారు వచ్చి చెరువులో గాలించినా అతని జాడ దొరకలేదు. వెంటనే జేసీబీ ద్వారా చెరువుకట్టకు గండిపెట్టారు. దీంతో చెరువులోని నీరు బయటకు వెళ్లిపోవడం తో చెరువులో నవీన్ మృతదేహం లభించింది. మృతదే హాన్ని బయటకు తీసి దహనసంస్కారాలు నిర్వహించారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య బాధిత కుటుంబాన్ని ఓదార్చారు.



యువకుడు పడి మృతిచెందిన చేపల చెరువు



నవీన్(ఫైల్)

విద్యుదాఘతంతో వృద్ధుడు మృతి

పాలకవీడు, మార్చి27: విద్యుదాఘతంతో వృద్ధుడు మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్ దర్గా గ్రామంలో బుధవారం జరిగింది. ఎస్ఐ లక్ష్మీనర్సయ్య, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జాన్‌పహాడ్ దర్గా గ్రామానికి చెందిన సాదినేని రోషయ్య(93) వృద్ధాప్యంతో మతిస్థిమితం సరిగాలేదు. అదే గ్రామంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తూ పక్కనున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. రోషయ్యకు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. రోషయ్య కుమారుడు సాదినేని జగ్గయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్య

పాలకవీడు, మార్చి27: వేర్వేరు కారణాలతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సిరాన్ భూయాన్(23) డీడీసీఎల్ ఏజెన్సీ ద్వారా సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని డెక్కన్ సిమెంట్ కర్మాగారంలో ఆరు నెలలుగా పనిచేస్తున్నాడు. సిరాన్ భూయాన్‌కు ఇటీవల పెళ్లి కుదిరింది. పెళ్లి ఇష్టం లేదని అదే ఏజెన్సీలో పనిచేసే సోదరుడు వరసయ్యే రాజ్‌దీప్‌కు, ఇతరులకు తరచూ చెప్తూ ఉండేవాడు. మంగళవారం సాయంత్రం కూడా అలాగే చెప్పి బయటకు వెళ్లాడు. రాత్రి తిరిగి రాకపోవడంతో బుధవారం ఉదయం సోదరుడు రాజ్‌దీప్, కొంత మంది కార్మికులతో కలిసి వెతకగా రావిపహాడ్ గ్రామ శివారులోని ఫారెస్ట్‌లో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ లక్ష్మినర్సయ్య తెలిపారు. సోదరుడు రాజ్‌దీప్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికు హుజూరర్‌నగర్ ఏరియాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది..

ఆత్మకూరు(ఎం): చేయడానికి సరైన పని దొరకడం లేదని జీవితం మీద విరక్తిచెంది పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. యాదాద్రి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం పారుపల్లి గ్రామానికి చెందిన పట్టూరి శేఖర్ రెండో కుమారుడు పట్టూరి శివ(26) గత కొంత కాలంగా ఏపని చేయకుండా ఇంటివద్దనే ఉంటున్నాడు. శివ కొన్ని రోజులు మండల కేంద్రంలోని గ్రోమోరు కేంద్రంలో పనిచేశాడు. అక్కడ పని మానేసి ఖాళీగానే ఇంటివద్ద ఉంటున్నాడు. రోజు మాదిగానే మంగళవారం రాత్రి కూడా శివ ఇంటి దాబాపై పడుకున్నాడు. అప్పటికే పురుగుల మందు తెచ్చిపెట్టున్నట్లు పోలీసులు తెలిపారు. బుధవారం తెల్లవారు జామున పురుగుల మందు తాగిన శివ తల్లికి తెలిపాడు. అప్పటికే అపస్మారక స్థితిలో పడిఉన్న శివను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. శివ తల్లి పట్టూరి కోటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఎండీ. యాకూబ్‌ఖాన్ తెలిపారు.

అనారోగ్య సమస్యలతో

చౌటుప్పల్ రూరల్: యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని హనుమాన్‌నగర్ లో గల అద్దె గదిలో బుధవారం దివీస్ కంపనీ ఉద్యోగి కోరెపల్లి సంజయ్(25) అనారోగ్య సమస్యలతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా సామర్లకోటకు చెందిన సంజయ్ నాలుగు మాసాలుగా దివీస్ కంపనీ లో ఉద్యోగం చేస్తున్నాడని సీఐ తెలిపారు. సంజయ్ మృత దేహన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాముకాటుతో పదో తరగతి విద్యార్థి మృతి

మోత్కూరు, మార్చి 27: తమ కుమారుడు పదో తరగతి పరీక్షలు ఉత్సాహంగా రాస్తున్నాడు.. పరీక్షలు ముగిస్తే సెలవులు, ఆ తర్వాత ఇంటర్‌లో చేర్పించాలన్న తల్లిదండ్రుల కలలపై పాము విషం చిమ్మింది. పాముకాటుతో విద్యార్థి బంగారు భవిష్యత్ కరిగిపోయి, తల్లిదండ్రుల కల చెదిరిపోయి పుట్టెడు శోకంలో మునిగారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలంలో ఈ సంఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మోత్కూరు మండలం దత్తప్పగూడెం గ్రామానికి చెందిన ముక్కెర్ల కుమార్, మమత దంపతుల కుమారుడు ఉమేష్(16) గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 18 నుంచి మోత్కూరులోని పరీక్ష కేంద్రానికి వెళ్లి వార్షిక పరీక్షలు రాస్తున్నాడు. ఇప్పటికే నాలుగు పరీక్షలు పూర్తయ్యాయి. మంగళవారం పరీక్ష రాసి వచ్చిన ఉమేష్ రాత్రి పొద్దుపోయే వరకూ గురువారం నాటి పరీక్షకోసం చదువుకున్నాడు. ఆ తర్వాత తల్లిదండ్రులు, తోబుట్టువుల పక్కన నేల మీద పడుకున్నాడు. రాత్రి నిద్రలో కట్ల పాము ఎప్పుడు కాటేసిందో ఎవరూ గమనించలేదు. అర్ధరాత్రి దాటాక ఉమేష్ లేచి కూర్చుని తల్లిదండ్రులను లేపి తనకు నలతగా ఉందని చెప్పాడు. ఇంతలో వాంతులు చేసుకున్నాడు. తనను ఏదో కరిచినట్లు అనిపించిందని చెప్పాడు. దీంతో వారు ఇంట్లో వెతకగా కట్ల పాము కనిపించింది. వెంటనే దాన్ని కొట్టి చంపారు. ఉమేష్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మరో సారి వాంతి చేసుకుని మృతి చెందాడు. మమత, కుమార్ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కాగా ఉమేష్ పెద్దవాడు. ఈ సంఘటనతో దత్తప్పగూడెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సహచర విద్యార్థులు బుధవారం సాయంత్రం నిర్వహించిన ఉమేష్ అంత్యక్రియల్లో పాల్గొని సంతాపం తెలిపారు.



ఉమేష్(ఫైల్)

ఎక్కడ చూసినా కన్నీటి గోసే

ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు కళ్లెదుటే ఎండుతుంటే అన్నదాతలు గోస పడుతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలో కొన్నిగ్రామాల రైతులకు మూసి నీరే పంట పొలాలకు జీవనాధారం. మూసీకి ఆనుకొని ఉన్న మగ్దుంపల్లి వంటి గ్రామాలు అనావృష్టి వల్ల ఎడారిగా మారింది. ఎప్పుడూ గలగల పారే మూసీ ఈ వేసవిలో పంటలకు నీరందక ఎండిపోయాయి. పదుల సంఖ్యలో మోటార్లు పడావుగా మారాయి. చేసేదేమీ లేక రైతులు తమ మోటార్లను ఒక్కొక్కటిగా ఇళ్లకు తరలిస్తున్నారు. ఈ సారీ నీరందక పూర్తిగా పంట నష్టం వాటిల్లి జీవనోపాధి కోల్పోయామని, ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద నష్ట పరిహారం అందించి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, యాదాద్రి



బీబీనగర్ మండలం మగ్దుంపల్లి గ్రామంలో మూసీనది ఎడారిగా మారడంతో నిరుపయోగంగా పంటపొలాల మోటార్లు, మోటర్ తీసుకెళ్తున్న రైతు



మగ్దుంపల్లి గ్రామంలో ఎండిన వరి పొలం



రోడ్డుపై గుంత..జర పైలం..


మాటూరు మధిర గ్రామం పెద్దబావి రోడ్డుపై ప్రమాదకరంగా ఏర్పడిన గుంత

మోటకొండూర్, మార్చి 27: మండలంలోని వర్టూర్ - మాటూర్ గ్రామాల మధ్య రోడ్డు గుంతలమయంగా మారింది. రోడ్డు పొడవునా అడుగుకో గుంత ఉండడంతో వాహనదారులు అవస్థలు అంత ఇంత కావు. మాటూర్ మధిర గ్రామం పెద్దబావి వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. ఆ దారి వెంట అదమరచి వెళితే అంతే సంగతులు. రోడ్డు మధ్యన గుంత ఏర్పడడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళన ప్రజల్లో నెలకొంది. గుంత వద్ద ఎలాంటి ప్రమాదపు సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వర్టూర్ నుంచి మాటూరు వరకు గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే రూ.కోటితో బీటీ రోడ్డు ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. కానీ నేటికీ పనులు ప్రారంభం కాకపోవడంతో ఆ రోడ్డు పై ప్రయాణం సాగించాలంటే ఆయా గ్రామాల ప్రజలు జంకుతున్నారు. అధికారులు స్పందించి, ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

పార్టీ టికెట్ కేటాయించిన వారినే గెలిపిస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ సోక్ పర్సన్ సుజాతాపాల్, ఎమ్మెల్యే అయిలయ్య

ఆలేరు రూరల్, మార్చి 27: రాబోయే ఎన్నికల్లో తమ పార్టీ ఎవరికి టికెట్ కేటాయించినా భారీ మెజార్టీతో గెలిపిస్తామని ఏఐసీసీ సోక్ పర్సన్ సుజాతాపాల్, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. బుధవారం ఆలేరులోని కాంగ్రెస్ కార్యాలయంలో వారు మీడియా సమావేశంలో మాట్లాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంటుందన్నారు. ఎలక్టోరల్ బాండ్స్ పథకం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఈ పథకం కింద స్వీకరించిన విరాళాలలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బహిర్గతం చేయాలని మొత్తం ఎలక్టోరల్ బాండ్లలో 55శాతం బీజేపీ ఒక్కటే అందుకుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బ్యాంక్ అకౌంట్లను ఫ్రీజ్ చేయడం వెనుక కుట్ర దాగి ఉందని ఎలక్షన్ నోటీఫికేషన్ ముందు ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీకి చెందిన 11 బ్యాంక్ అకౌంట్లను ఫ్రీజ్ చేయడం అప్రజాస్వామికమన్నారు. సుప్రీం కోర్టు ఇటీవల బీజేపీ ఎలక్టోరల్ బాండ్ పథకాన్ని రాజ్యాంగ విరుద్ధమని వెల్లడించినా ఆ పార్టీ బహిర్గతం చేయకపోవడం ప్రజాస్వామ్యంలో సరైంది కాదన్నారు. పీసీసీ కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, సంధ్యారెడ్డి, బంద్రు శోభారాణి, నీలం పద్మ, ఎంపీపీ గంధమల్ల అశోక్, అనిత, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

'ప్రజాపాలన'తో కాంగ్రెస్‌కు పెరుగుతున్న ఆదరణ


కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అయిలయ్య

ఆత్మకూరు(ఎం), మార్చి 27: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలనతో ప్రజల నుంచి మంచి ఆదరణ పెరుగుతోందని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. ఆత్మకూరు మండల కేంద్రం, కొరటికల్ గ్రామాల నుంచి బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు , బుధవారం యాదగిరిగుట్టలో ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరగా, వారికి పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హమీలను 100 రోజుల్లోనే నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని అన్నారు. కాంగ్రెస్ ప్రజాపాలన చూసి పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బూడిది శేఖర్ తోపాటు పలువురు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

108ను సద్వినియోగం చేసుకోవాలి

వలిగొండ, మార్చి 27: 108 సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ నజీరుద్దీన్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని 108 వాహనాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనంలో పరికరాల పని తీరు, అత్యవసర సమయంలో వినియోగించే మెడిసిన్‌పై ఆరాతీశారు. సిబ్బందికి తగిన సూచనలు, సలహాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఈఎంటీ శివరాం, స్థానిక 108 సిబ్బంది ఈఎంటీ గుండాల దినేష్, నరేష్ వర్మ పాల్గొన్నారు.

'ధరణి' సమస్యలను పరిష్కరించాలి


అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

భువనగిరి అర్బన్, మార్చి 27: జిల్లాలో దీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ధరణి సమస్యలను వెంటనే పరిష్కరించాలని శక్తి మిషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, దళిత ఐక్యవేదిక నాయకుడు కర్తాల శ్రీనివాస్ కోరారు. కలెక్టరేట్‌లో బుధవారం రెవెన్యూ కలెక్టర్ పి.బెన్‌షాలోమ్‌కు వినతి పత్రం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. అనేకమంది రైతులు దరఖాస్తులు చేసుకున్నప్పటికీ నేటికీ వాటికి పరిష్కారం చూపలేదన్నారు. కొత్త ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ నిర్వహించినప్పటికీ సమస్యలు అలాగే ఉన్నాయన్నారు. అధికారులు చొరవ చూపి, సమస్యను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వినతిపత్రం అందజేసినవారిలో దళిత ఐక్య వేదిక కన్వీనర్ బట్టు రామచంద్రయ్య, భువనగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, కౌన్సిలర్ ఈరపాక నర్సింహ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ఇటుకల దేవేందర్, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు సుర్వంగ శివలింగం, రిటైర్డ్ ఎంఈవో బండారు రవివర్ధన్, నాయకులు గ్యాస్ చిన్న, శివ, బాలరాజు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను వసూళ్లపై నజర్

- ఆర్థిక సంవత్సరంలో మిగిలింది నాలుగు రోజులే
- వీలైనంత ఎక్కువ మొత్తం వసూళ్లే సిబ్బంది లక్ష్యం

భువనగిరి, చౌటుప్పల్ మునిసిపాలిటీల్లో నూరుశాతం ఆస్తి పన్ను వసూళ్లే లక్ష్యంగా సిబ్బంది రంగంలోకి దిగారు. ఆర్థిక సంవత్సరం ముగింపునకు గడువు నాలుగు రోజులే ఉండడంతో కార్యక్షేత్రంలో పనిని వేగవంతం చేశారు.


భువనగిరి, చౌటుప్పల్ పట్టణాల వ్యూ

భువనగిరి టౌన్, మార్చి 27: ఆర్థిక సంవత్సరం మరో నాలుగు రోజుల్లో ముగియనుంది. కానీ ఆస్తిపన్ను రూపేనా భువనగిరి మునిసిపాలిటీకి రూ.2.66 కోట్లు వసూలు కావలసి ఉన్నది. దీంతో శతశాతం పన్ను వసూలు లక్ష్యంగా మునిసిపల్ యంత్రాంగం తీవ్రంగా శ్రమిస్తోంది. ప్రభుత్వం ఆస్తిపన్ను అపరాధ రుసుముపై 90శాతం రాయితీని ప్రకటించినప్పటికీ సద్వినియోగం చేసుకుని బకాయిదారుల ఆస్తులను జప్తు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇందు కోసం ప్రత్యేక వాహనాలను కూడా ఏర్పాటు చేయడం గమనార్హం.

ఆస్తిపన్ను డిమాండ్ ఇలా..

పట్టణంలో 14,628 అసిస్మెంట్స్ నుంచి 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.7,23,09,000 ఆస్తిపన్ను డిమాండ్ ఉంది. వీటిలో 2,32,84,000 ఏరియర్స్‌గా, రూ.4,90,25,000 కరెంట్ ఆస్తిపన్ను డిమాండ్‌గా ఉన్నది. కానీ ఇప్పటి వరకు రూ.4,56,45,000 (63శాతం) ఆస్తిపన్ను వసూలు కాగా వీటిలో రూ.98.27 లక్షలు ఏరియర్స్ పన్ను, రూ.3,58,18,000 కరెంట్ ఆస్తిపన్ను వసూలైంది. అయితే ఇప్పటి వరకు రూ.2,66,64,000 ఆస్తిపన్ను వసూలు కావాల్సి ఉండగా వీటిలో ఏరియర్స్ ఆస్తిపన్ను రూ.1,34,57,000, కరెంట్ ఆస్తిపన్ను రూ.1,32,07,000 రావాల్సి ఉన్నది.

90శాతం సబ్సిడీతో రూ.52లక్షలు వసూలు

శతశాతం ఆస్తిపన్ను వసూలే లక్ష్యంగా ఆస్తిపన్ను అపరాధ రుసుముపై ప్రభుత్వం 90శాతం మాఫీని ప్రకటించింది. ఈ నెల 31లోపు బకాయి ఆస్తిపన్ను చెల్లిస్తే 90శాతం రాయితీ వర్తిస్తుంది. ఇప్పటి వరకు 1010 అసిస్మెంట్స్ నుంచి రూ.52లక్షలు బకాయి ఆస్తి పన్ను వసూలైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి శతశాతం ఆస్తిపన్నును వసూలు లక్ష్యంగా మునిసిపల్ యంత్రాంగం పని చేస్తోందని కమిషనర్ పి.రామాంజుల్‌రెడ్డి తెలిపారు. ప్రజలు కూడా స్వచ్ఛందంగా ఆస్తిపన్ను చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు.

చౌటుప్పల్‌లో ముమ్మరంగా వసూళ్లు

చౌటుప్పల్ టౌన్ : చౌటుప్పల్ మునిసిపాలిటీలో ఆస్తి పన్నుల వసూళ్లను ముమ్మరంగా చేస్తున్నారు. మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్ పర్యవేక్షణలో 25 నుంచి 30 మంది సిబ్బంది ప్రతీ ఆస్తి పన్నుదారుడిని రెండు, మూడు రోజుల కొకసారి టచ్ చేస్తున్నారు. ఈ నాలుగు రోజుల అవకాశాన్ని యజమానులు వినియోగించుకుని ఆస్తి పన్నులను చెల్లించాలని సిబ్బంది కోరుతున్నారు. నూటికి నూరు శాతం పన్నులను వసూళ్లు చేయాలన్న లక్ష్యంతో కమిషనర్ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకుని ముందుకు వెళుతున్నారు. మునిసిపాలిటీలోని 23 ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి రూ.9.27 లక్షల ఆస్తి పన్నులను మునిసిపాలిటీకి చెల్లించవలసి ఉంది. ప్రజలకు ఆదర్శంగా ఉండవలసిన ప్రభుత్వ అధికారులు తమతమ కార్యాలయాలకు ఆస్తి పన్నులను చెల్లించకుండా పెండింగ్ పెట్టడంపై విమర్శలకు గురి కావలసి వస్తోంది. 8,315 గృహాలు, వ్యాపార మడిగెలకు సంబంధించి రూ.2.12 కోట్లు బాకియి మునిసిపాలిటీకి రావలసి ఉంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 71 శాతం ఆస్తి పన్నులను వసూలు చేయగా, 2023-24 లో ఈ నెల 26 నాటికి 70 శాతం పన్నులను వసూలు చేశారు. ఈ నెల 31 తో ఆర్థిక సంవత్సరం ముగిసే లోపుగా మరో పది శాతం ఆస్తి పన్నుల బకాయిలను వసూలు చేసే అవకాశాలు ఉన్నాయి.

- 23 ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి రూ.13.73 లక్షల ఆస్తి పన్నులు ఉండగా, అందులో రూ.4.46 లక్షలను వసూలు చేశారు. మిగిలిన రూ. 9.27 లక్షలను వసూలు చేసేందుకు సిబ్బంది నిత్యం ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరుగుతున్నారు.
- 6,857నివాస గృహాల ఆస్తి పన్ను రూ.2,95,58,000-00 ఉండగా, అందులో రూ, 2,06,51,000-00 లను వసూలు చేశారు. మిగిలిన రూ. 69,87,000-00 లను వసూలు చేసేందుకు సిబ్బంది ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు.
- 988 వ్యాపార సంస్థల ఆస్తి పన్నులు రూ.3,14,98,000-00 లు ఉండగా , అందులో రూ. 2,15,29,000-00 లను వసూలు చేశారు. మిగిలిన రూ.99,69,000-00లను వసూలు చేసేందుకు నిత్యం వ్యాపార సంస్థల యజమానుల చుట్టూ తిరుగుతున్నారు.
- 447 నివాస గృహాలు కమ్ వ్యాపార మడిగెల ఆస్తి పన్నులు రూ.70.59 లక్షలు ఉండగా, అందులో 56.22 లక్షలను వసూలు చేశారు. మిగిలిన రూ. 14.37 లక్షలను వసూలు చేసేందుకు శ్రమిస్తున్నారు.
- మునిసిపాలిటిలో మొత్తం 8,315 ఆస్తులకు గాను పన్నులు రూ.6,94,88,000-00లు ఉండగా, అందులో రూ. 4,82,48,000-00 లను వసూలు చేశారు. మిగిలిన రూ. 2.12 కోట్లను వసూలు చేసేందుకు సిబ్బంది ముమ్మరంగా తిరుగుతున్నారు.

నూరు శాతం వసూళ్లే లక్ష్యం



నూటికి నూరు శాతం ఆస్తి పన్నులను వసూళ్లు చేయాలన్న లక్ష్యంతో పని చేస్తున్నాం. నివాస గృహాలు, వ్యాపార మడిగెల కొలతల్లో ఎక్కువ, తక్కువలు ఉంటే యజమానుల ఫిర్యాదు మేరకు మళ్లీ కొలతలు వేసి సరి చేస్తున్నాం. 2022-23 ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న ఫెనాల్టీల్లో 90 శాతం తగ్గించి పన్నులను తీసుకుంటున్నాం. ఈ నెల 31 వరకు ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని ఆస్తుల యజమానులు సద్వినియోగం చేసుకోవాలి. లేని పక్షంలో వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఆస్తి పన్నులను ఫెనాల్టీలతో సహా వసూలు చేస్తాం. ఆస్తి పన్నులు పెండింగ్ ఎక్కువగా ఉన్న యజమానులకు మునిసిపల్ చట్టం ప్రకారం నోటీసులను జారీ చేస్తున్నాం. ఆస్తి పన్నులను చెల్లించని యజమానుల ఇళ్లకు సంబంధించిన నల్లా కనెక్షన్లను తొలగిస్తాం. పూర్తిగా ఆస్తి పన్నులను క్లియర్ చేసి మునిసిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి.

-వెంకటేశ్వరనాయక్, కమిషనర్, చౌటుప్పల్ మునిసిపాలిటీ

సుందర నగరంగా తీర్చిదిద్దుతా

- తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సామేల్

మోత్కూరు, మార్చి 27: మోత్కూరు మునిసిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, సుందర నగరంగా తీర్చిదిద్దుతానని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. బుధవారం మోత్కూరు మునిసిపాలిటీ కేంద్రంలో బీఆర్ఎస్, ఇతర పార్టీల నుంచి పలువురు కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాత, కొత్త అన్న భావన లేకుండా లేకుండా నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. పార్లమెంటు ఎన్నికల అనంతరం జామచెట్ల బావి నుంచి రామారం వరకు రోడ్డును బీటీ చేయిస్తానని, మోత్కూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆర్టీసీ డిపో ఏర్పాటు, బిక్కేరు వాగుపై నూతన బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. త్వరలోనే మోత్కూరు మెయిన్‌రోడ్డు పనులు ప్రారంభిస్తామన్నారు. బునాదిగాని కాల్వ నిర్మాణం పూర్తి చేయిస్తానన్నారు. పనకబండ సింగిల్‌విండో డైరెక్టర్ కారుపోతుల ముత్యాలు, పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు పోచం బిక్షపతి, హమాలి సంఘం అధ్యక్షుడు కూరెల్ల రాములు, సీఐటీయూ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సెంట్రింగ్, దర్జీ, పండ్ల బండ్ల సంఘాల అధ్యక్షులు జంగ సతీష్, జిల్లా రవీందర్, పోతరబోయిన నర్సింహ, బీఆర్ఎస్ నాయకులు మొగుళ్ల నర్సిరెడ్డి, బాలెంల మధు, కళ్లెం నర్సయ్య, మన్నె మల్లయ్యతోపాటు సుమారు 200 మంది కాంగ్రెస్‌లో చేరగా వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుండగోని రామచంద్రు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మునిసిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవిత, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ కంచర్ల యాదగిరిరెడ్డి పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

మోత్కూరు పట్టణంలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. రామలింగేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో జరిగిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. వచ్చే యేడాది బ్రహ్మోత్సవాల నాటికి ఆలయాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. తొలిసారి ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యేను ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటి చైర్మన్ గుండగోని రామచంద్రు, నాయకులు పైళ్ల సోమిరెడ్డి, పేలపూడి సత్యనారాయణచౌదరి, డాక్టర్ కొత్తపల్లి వెంకటేశ్వర్లు, కారుపోతుల వెంకట్, బయ్యని రాజు, కోమటి మత్స్యగిరి, ఉయ్యాల అంజయ్య, బీసు యాదగిరి, తొట్ల యాదగిరి, పూజారులు రామలింగం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనారాయణస్వామి రథోత్సవం


రథోత్సవంలో భాగంగా చిరుతల భజన చేస్తున్న మహిళలు

భూదాన్‌పోచంపల్లి, మార్చి 27 : పట్టణంలోని లక్ష్మీనారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి రథోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. పట్టణంలో తాళమేళ, మృదంగ, మంగళ వాయిద్యాలతో, భక్తిరస విన్యాసాలతో చిప్పలపల్లి జైహనుమాన్ కోలాట కళాబృందం, శాలిగౌరారం వీరాంజనేయ కోలాట కళాబృందం నిర్వహించిన చిరుతల భజనలు భక్తులను అలరించాయి. రథోత్సవ కార్యక్రమానికి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తడక వెంకటేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, పోచంపల్లి, నేనేత టైఅండ్‌డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, జిల్లా పద్మశాలి సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు తడక రమేష్, దేవాలయం అధ్యక్షుడు అంకం వినోద్‌కుమార్, పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములుశ్రేష్టి, ఉపాధ్యక్షుడు అంకం మురళి, మున్సిపల్ కౌన్సిలర్లు మోటె రజిత రాజు, బోగ భానుమతి విష్ణు, దేవాలయం మాజీ అధ్యక్షులు గునిగంటి మల్లేష్‌గౌడ, కొయ్యడ నర్సింహగౌడ్, అంకం యాదగిరి, దేవాలయం ధర్మకర్తలు మోటె మహేష్, చేరాల సుధీర్‌కుమార్, వేశాల మురళి, కూరపాటి బాబు, సకినాల నాగయ్య, గునిగంటి సుభాష్‌గౌడ్, పెద్దల ముత్యాలు, సైదుగాని రాములు, బత్తుల బాలాజీ, పొనమోని కావ్య, వంగూరి బాలకృష్ణ పాల్గొన్నారు. రాత్రి హోమం, బలిహరణం, పూర్ణాహుతి, ధ్వజపట ఉద్వాసన, చక్రతీర్థ స్నానం, నివేదన, హారతి, తీర్థప్రసాద గోష్టి, పుష్పయాగం తదితర ఉత్సవాలు నిర్వహించారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

ఆత్మకూరు(ఎం) మార్చి 27: ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కువినియోగించుకోవాలని కోరుతూ మండలంలోని పల్లెర్ల, కూరెళ్ల, హైస్కూల్ విద్యార్థులు బుధవారం గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ, మానవహారం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. తల్లిదండ్రులు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా విద్యార్థులు కృషి చేయాలని హెచ్ఎం సూచించారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకు టోర్నమెంట్స్


ప్రథమ బహుమతి సాధించిన క్రీడాకారులతో ఎంపీపీ తాడూరు వెంకట్‌రెడ్డి

చౌటుప్పల్ రూరల్, మార్చి 27: గ్రామీణ క్రీడా కారులను ప్రోత్సహించేందుకు టోర్నమెంట్స్ దోహదం చేస్తాయని చౌటుప్పల్ ఎంపీపీ తాడూరు వెంకట్‌రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండలం ఎల్లగిరి ఎంపీటీసీ పరిధిలోని ఎల్లగిరి, తూప్రాన్‌పేట్, ఖైరతాపురం గ్రామాలకు చెందిన క్రీడాకారులతో క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన వెల్మ రామలింగేశ్వర్‌రెడ్డి జట్టుకు రూ.60 వేల నగదుతో పాటు షీల్డును దాత ఎంపీపీ వెంకట్‌రెడ్డి అందజేశారు. ద్వితీయ బహుమతి సాధించిన ఎండి.ఇబ్రహీం జట్టుకు రూ. 30 వేల నగదు తో పాటు షీల్డును దాత రిక్కల భాస్కర్ రెడ్డి బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అందజేశారు. కార్యక్రమంలో ఎల్లగిరి మాజీ సర్పంచ్ రిక్కల ఇందిరా సత్తిరెడ్డి, మాజీ ఉప సర్పంచ్‌లు పద్మారెడ్డి, బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

చేనేత సెల్ కన్వీనర్‌గా వనం సత్యనారాయణ

చౌటుప్పల్ రూరల్, మార్చి 27: బీజేపీ చేనేత సెల్ కన్వీనర్‌గా చౌటుప్పల్ మండలం ఎస్.లింగోటం గ్రామానికి చెందిన వనం సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ మండల అధ్యక్షుడు మల్లేషం నియామకపత్రాన్ని అందజేశారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

సంస్థాన్ నారాయణపురం, మార్చి 27 : భూగర్భ జలాలు అడుగంటడంతో పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు సుర్వి రాజుగౌడ్ డిమాండ్ చేశారు. మండలంలోని రాచకొండలో ఎండిపోయిన పంట పొలాలను బుధవారం బీజేపీ నాయకులు పరిశీలించారు. పంట నష్టపోయిన రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం రాష్ట్రంలో అమలు జరిగితే వర్షాభావ పరిస్థితుల్లో రైతులకు మేలు జరిగేదని ఆయన అన్నారు. కార్యక్రమంలో నాయకులు కొర్ర శంకర్ చౌహన్, సంపతి సుధాకర్ రెడ్డి, రావర్తి ప్రదీప్ గౌడ్, కొర్ర శోభన్ నాయక్, కొర్ర సురేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'మూడోసారి మోదీ ప్రధాని కావడం ఖాయం'

అడ్డగూడూరు, మార్చి 27: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మూడోసారి బీజేపీ 370 సీట్లు గెలుచుకుని నరేంద్ర మోదీ మరోసారి ప్రధానమంత్రి కావడం ఖాయమని బీజేపీ మహిళ మోర్చా మండల అధ్యక్షురాలు తోట అలివేలు అన్నారు. చాయ్‌పే చర్చ కార్యక్రమం బుధవారం మండలంలోని చౌళ్లరామారంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మోదీ పాలన ద్వారానే దేశం సురక్షితంగా ఉంటూ, అభివృద్ధి పథంలో నడుస్తుందని అన్నారు. భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరారు. మనీషా, జ్యోతి, ఎల్లమ్మ, అండాలు, సుభద్ర ఉన్నారు.

సీపీఎం అభ్యర్థిని గెలిపించాలి: చెరుపల్లి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు సీతారాములు

రామన్నపేట, మార్చి 27: ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను ప్రజలు ఆదరించి గెలిపించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో భువనగిరి సీపీఎం పార్లమెంటు అభ్యర్థి జహంగీర్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 35 సంవత్సరాలుగా ప్రజా ఉద్యమాలకు సారథ్యం వహించిన మచ్చ లేని నాయకుడు జహంగీర్ అని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నిలిపిన అభ్యర్థులతో పోల్చినపుడు జహంగీర్ మాత్రమే ప్రజానాయకుడు అని అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. వరి పంటకు ఐదు వందలు బోనస్ ఈ యాసంగి నుంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుబంధు, వ్యవసాయ పరికరాలపై సబ్సిడీ కొనసాగించి కరువు మూలంగా నష్టపోయిన రైతులను గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టులు పది లక్షల ఎకరాల భూమిని పంచితే భువనగిరి పార్లమెంటు పరిధిలోనే నాలుగు లక్షల ఎకరాల భూమి ఉందని తెలిపారు. అలాంటి మహాపోరాట యోధుల వారసుడిగా ముందుకొస్తున్న సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకులు బొంతల చంద్రారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా, బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేక అశోక్‌రెడ్డి, మాటూరి బాలరాజు, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేష్, బోయిని ఆనంద్, మీర్ ఖాజాఅలీ, బల్గూరి అంజయ్య పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయ సాధనకోసం పోరాడాలి


సమావేశంలో మాట్లాడుతున్న పీవైఎల్ జిల్లా కార్యదర్శి కుమార్

భూదాన్‌పోచంపల్లి, మార్చి 27: స్వాతంత్ర్యం అంటే పాలకులు మారడం కాదని, సమాజంలో అసమానతలు పోయి ప్రతి మనిషి స్వేచ్ఛగా బతకాలని చెప్పిన భగత్‌సింగ్ ఆశయాల సాధన కోసం పోరాడాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) జిల్లా ప్రధాన కార్యదర్శి బేజాడి కుమార్ పిలుపునిచ్చారు. భారత స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్ 93వ వర్ధంతి సభ భూదాన్‌పోచంపల్లిలో బుధవారం పీవైఎల్ పట్టణ కార్యదర్శి పగడాల శివ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించి, దోపిడీలేని సమాజాన్ని కోరిన వేగుచుక్క భగత్‌సింగ్ అని అన్నారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభలో పీవైఎల్ జిల్లా నాయకులు చిరబోయిన బాలకృష్ణ, ఆకుల కృష్ణ, రాజకొండ ఉదయ్, ఆరె ఉదయ్‌కిరణ్, పగడాల శివ, సూరిబాబు, సుధాకర్, సతీష్, నోముల శివకుమార్, నాగరాజు, పగడాల సతీష్, గోవర్ధన్, మహేష్, సతీష్, సాయి పాల్గొన్నారు.

మునిసిపల్ తైబజార్ వేలం వాయిదా

భువనగిరి టౌన్, మార్చి 27: భువనగిరి మున్సిపల్ తై బజార్ వేలం పాట ఈ నెల 29న నిర్వహించాల్సి ఉండగా తాత్కాలికంగా వాయిదా వేసినట్టు కమిషనర్ పి.రామాంజుల్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గత సంవత్సరం తై బజార్ వసూలలో నష్టం జరిగినందున తననే రెన్యువల్ చేయాలంటూ అప్పటి కాంట్రాక్టర్ హైకోర్టును ఆశ్రయించాడు. ఫలితంగా హైకోర్టు ఈ నెల 22న జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులతో వేలం పాటను వాయిదా వేసినట్టు కమిషనర్ తెలిపారు. కాగా ఈ మునిసిపాలిటీకి ఆదాయం సమకూరే తై బజార్ వేలంపాట నిర్వహణకు అనుమతించాలంటూ మున్సిపాలిటీ కూడా హైకోర్టును ఆశ్రయిస్తున్నట్టు తెలిసింది.

సామాన్యులే రాజకీయాల్లోకి రావాలి


విలేకరులతో మాట్లాడుతున్న పీపుల్స్ ప్రొటెక్షన్ పార్టీ వ్యవస్థాపకుడు వి.సధానందరెడ్డి

ఆలేరు రూరల్, మార్చి 27: రాజకీయ వ్యవస్థ రోజురోజుకూ భ్రష్టు పడుతున్నందున సామాన్య ప్రజలు, నిజాయితీ పరులు రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందని వీఆర్ఎస్ తీసుకున్న అడిషనల్ డీసీపీ, పీపుల్స్ ప్రొటెక్షన్ పార్టీ వ్యవస్థాపకుడు వి.సధానందరెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఆలేరులో విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు కావాల్సినవి అవకాశాలు, వనరులే కాని వ్యసనాలు ఉచిత పథకాలు సరైనవి కాదన్నారు. ప్రజలంతా ఒకే కుటుంబ సభ్యులని, ప్రజా స్వామ్యంలో ప్రజలే యజమానులని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి నుంచి బరిలో నిలిచారన్నారు. అవినీతి రహిత శాంతియుత పారదర్శక పాలన అందించడమే తమ పార్టీ లక్ష్యమన్నారు. సమావేశంలో వెంకటేశ్, బండి వెంకటేష్ ఉన్నారు.